నమస్తే తెలంగాణ

# బాలికల ఉన్నతికే సాధికారత క్లబ్‌లు



గంభీరావుపేట: కేజీ టూ పీజీ క్యాంపస్‌లోని బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన సాధికారతా క్లబ్‌లో విద్యార్థినులు

- మహిళా సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ త్రివేణి
- నేరెళ్ల, గంభీరావుపేట పాఠశాలల్లో బాలికా సాధికారత క్లబ్ ఏర్పాటు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 14: బాలికల ఉన్నతికి సాధికారత క్లబ్‌లు ఎంతో దోహదం చేస్తాయని మహిళా సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ త్రివేణి పేర్కొన్నారు. తంగళ్ల పల్లి మండలం నేరెళ్లలోని జడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం బాలికల సాధికారత క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ త్రివేణి మాట్లాడుతూ బాలికలు తమ హక్కులు తెలుసుకుని, జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకునే దిశగా సాధికారిత క్లబ్‌లు అవగాహన కల్పిస్తాయని తెలిపారు. సోషల్ మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చైల్డ్ హెల్ప్‌లైన్, వుమెన్స్ హెల్ప్ లైన్ నంబర్లపై సమగ్రంగా వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్లను తమ ఫోన్‌లో స్టోర్ చేసుకుని, స్వేటగా పెట్టుకోవాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులు, షీ టీంకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్‌ఐ ప్రమీల సూచించారు. ఇక్కడ హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**కేజీ టూ పీజీ క్యాంపస్ బాలికల పాఠశాలలో..**

గంభీరావుపేట, డిసెంబర్ 14: మండల కేంద్రంలోని కేజీ టు పీజీ క్యాంపస్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ నూతన క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బాలికల హక్కులు, బాధ్యత తదితర అంశాలపై సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. బాలికల హక్కులకు భంగం కల్గినప్పుడు తమ కుటుంబంలోని తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులు, పోలీసులనుగాని సంప్రదించాలని సూచించారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న క్లబ్ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్వేతాకుమారి, హెచ్ఎంలు పద్మాదేవి, శ్రీనివాస్, ఏఎస్ఐ ప్రభాకర్, పాఠశాల వైస్ చైర్మన్ రేణుక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు ఉన్నారు.

## లక్ష్మారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం



లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, చల్మెడ విద్యాసంస్థల అధినేత లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, డిసెంబర్ 14: మామిడిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నేత తీపిరెడ్డి లక్ష్మారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా చల్మెడ విద్యా సంస్థల అధినేత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు బాధిత కుటుంబ సభ్యులను జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని, కుటుంబ సభ్యులు మనోవేదన చెందకుండా ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్ రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచులు కొక్కుల భారత, మంతెన సంతోష్, సీనియర్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, పన్నాల లక్ష్మారెడ్డి, జవ్వాజి మల్లయ్యగౌడ్, జవ్వాజి రవీందర్‌గౌడ్, కొక్కుల రాజు, ఏలేటి లక్ష్మారెడ్డి, షబ్బీర్, నాగరాజు, రమేశ్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్ ఉన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నాయకుల పరామర్శ



హైదరాబాద్ యశోద దవాఖానలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం కలిసి పరామర్శించిన అనంతరం అభివాదం చేస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కుమార్

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 14: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ సూచించారు. గురువారం దుమాలలో ఈఎంఆర్ఎస్ రెండో రాష్ట్రస్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో శారీక, మానసిక ఎదుగుదల జరుగుతుందని చెప్పారు. ఇక్కడ ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ కదిరె రజిత, పాఠశాలల ప్రతినిధులు ఉన్నారు.

## ఇసుక క్వారీని అడ్డుకున్న గ్రామస్తులు

వేములవాడ రూరల్, డిసెంబర్ 14 : వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి-బొల్లారం శివారులోని మూలవాగులో ఇసుక క్వారీకి అధికారులు ఏర్పాట్లు చేయగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ క్వారీ ఏర్పాటుతో భూగర్భ జలాలు దెబ్బతింటాయన్నారు. గతంలో మూలవాగులో నిర్మించిన చెక్‌డ్యాం వద్ద వరద ఉధృతికి పంట పొలాలు దెబ్బతిన్నా పరిహారం ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ఇసుక క్వారీ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మరోసారి గ్రామస్తులతో మాట్లాడి క్వారీ పనులు చేపడుతామని అధికారులు వెల్లడించారు.

## దర్జీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట, డిసెంబర్ 14: మరిమడ్ల ఏకలవ్య గురుకుల బాలుర పాఠశాల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య బాలికల పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు జతల స్కూల్ యూనిఫాం కుట్టేందుకు దర్జీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారి వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల దర్జీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రాంతీయ సమన్వయ కార్యాలయం, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల సంస్థ అంబేద్కర్ భవన్ ఎదురుగా హన్మకొండలో ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 16న అదనపు కలెక్టర్ సమక్షంలో ధరలు నిర్ణయిస్తామని వెల్లడించారు.

## సామర్థ్యాలను పెంపొందించాలి

వేములవాడ రూరల్, డిసెంబర్ 14 : విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని డీఈవో రమేశ్‌కుమార్ సూచించారు. గురువారం చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్ బుక్కులు, పీటీఎం రిజిస్టర్లు పరిశీలించి, విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా బాలికల అధికారి పద్మజ, ప్రధానోపాధ్యాయుడు మహేశ్, ఉపాధ్యాయురాలు రజిని, సీఆర్‌పీ రాజు ఉన్నారు.

# మంత్రులకు ఎమ్మెల్యే ఆది ఆత్మీయ సన్మానం

వేములవాడ, డిసెంబర్ 14 : వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ గురువారం పలువురు మంత్రులను కలిసి ఆత్మీయ సన్మానం చేశారు. తెలంగాణ శాసనసభ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుశాఖ మంత్రి సీతక్క, శాసనసభ వ్యవహారాలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రెవెన్యూ, గృహ నిర్మాణాలు, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపి తిరుమల, తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

తెలంగాణ చౌక్, డిసెంబర్ 14: రాష్ట్రంలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అరెస్టు వివరాలను టౌన్ సీఐ ఉపేందర్ వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మడక నర్సయ్య సులభ మార్గంలో డబ్బు సంపాదించి జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దొంగతనాలు చేసి పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో 61 దొంగతనం కేసులు నమోదయ్యాయి. తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలోని పెద్దమ్మ గుడిలో గత అక్టోబర్‌లో దొంగతనం చేశాడు. మూడు రోజుల క్రితం సిరిసిల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దబోనాల బైపాస్ రోడ్డు పక్కనగల చిన్న హోటల్‌లో దొంగతనం జరిగినట్లుగా బాధితుడు బైరిగిని సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. టౌన్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పట్టణంలోని నర్సింగ్ కళాశాల ప్రాంతంలో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 14: గొల్లపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొప్పాపూర్‌కు చెందిన షేక్ సలీం(45) మృతి చెందినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. సలీం బుధవారం రాత్రి తిమ్మాపూర్ నుంచి గొల్లపల్లి వైపు బైక్‌పై వస్తున్న క్రమంలో బొప్పాపూర్‌కు చెందిన అంబ రమేశ్ తన బైక్‌పై వేగంగా వచ్చి సలీం బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో సలీం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## హత్య కేసుపై విచారణ

రుద్రంగి, డిసెంబర్ 14: మండల కేంద్రంలో గత సంవత్సరం జూన్‌లో జరిగిన నేవూరి నర్సయ్య హత్య కేసుపై అదనపు ఎస్పీ చంద్రయ్య గురువారం రుద్రంగిలో విచారణ చేపట్టారు. హత్యకు దారి తీసిన భూ పంచాయతీ వివరాలను బాధిత కుటుంబ సభ్యులు, సంఘం పెద్దలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ రాజేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పాఠశాల వేళల్లో బస్సులు నడపాలి

కోనరావుపేట, డిసెంబర్ 14: విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన సమయంలో బస్సులు నడపాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజం కార్తీక్ డిమాండ్ చేశారు. గురువారం నిమ్మపల్లి గ్రామంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో చదివే విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయపాలన పాటించి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి కొన్ని గ్రామాల్లో బస్సును ఆపడం లేదని, దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ చిలుక వినయ్, నంద్యాల యశ్వంత్, పూజం చందు, మ్యాదరి శివ పాల్గొన్నారు.

# 17వ పోలీస్ బెటాలియన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 14: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమాండెంట్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్ట్-2, బార్బర్ (మంగలి)-2, దోబి (చాకలి)-3, ఆఫీస్ సబార్డినేట్ -2, పారిశుధ్య కార్మికులు-3, స్వీపర్-5, హెల్త్‌అసిస్టెంట్-2 పోస్టులకోసం పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హులైనవారు ఈ నెల 31 లోపు బెటాలియన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, కోనరావుపేట, గంభీరావుపేట మండలాల వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

వేములవాడ, డిసెంబర్ 14: వేములవాడ పట్టణ పరిశుభ్రతకు ప్రజలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కౌన్సిలర్ నరాల శేఖర్ సూచించారు. గురువారం పట్టణంలోని 21వ వార్డులో ఆయన ఇంటింటా తడి,పొడి చెత్తను వేరు చేసేందుకు చెత్త బుట్టలను అందజేసి మాట్లాడారు. చెత్తను వీధిలో పడేయకుండా తడి, పొడి చెత్తను ఇంట్లో వేరుచేసి ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. పట్టణ పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వామ్యులైనప్పుడే వేములవాడ అందమైన పట్టణంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఉన్నారు.